


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 08-10-2025 సంపుటి : 07 సంచిక : 149 పేజీలు : 8 వెల : రూ 3-00

# ప్రధాని శ్రీశైలం పర్యటన ఖరారు..



నంద్యాల, అక్టోబర్ 7: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైలం క్షేత్ర పర్యటన ఖరారైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. శ్రీశైలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోది పర్యటించే ప్రదేశాలైన ఛత్రపతి శివాజి స్ఫూర్తి కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. ఈరోజు (మంగళవారం) శివాజి రాజదర్బార్, శివాజి ధ్యానమందిరం ఏర్పాట్లను ఎంపీ బైరెడ్డి, శబరి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పరిశీలించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ.. సరళీకృత జీఎస్టీ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమానికి ఈనెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పాల్గొంటారని తెలిపారు.ప్రధాన మంత్రి మోదీ మొదటిసారిగా శ్రీశైలం రావడం శు భ పరిణామమని అన్నారు. ప్రధాని శ్రీశైలం పర్యటనతో క్షేత్ర వైభవం మరింత పెరుగుతుందన్నారు. శ్రీశైలం ప్రాంతం యొక్క విశిష్టత టూరిజం అభివృద్ధి ఈ ప్రాంతం యొక్క విశేషాలు ప్రపం చానికి తెలిసే అవకాశం ఉందని చెప్పారు. శ్రీశైలం మల్లన్న దర్శనం అనంతరం శివాజి స్ఫూర్తి కేంద్రానికి ప్రధాన మంత్రి మోదీ చేరు కుంటారని మాధవ్ పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. టీడీపీ నేతలతో చంద్రబాబు చర్చ



తిరుపతి, అక్టోబర్ 7: తెలంగాణ టీడీపీ నేతలతో ఆ పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు (మంగళవారం) సాయంత్రం 7 గంటలకు సమావేశంకానున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పట్ల అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కూటమి అభ్యర్థి విజయానికి నేతలు కృషి చేయాలని వారికి దిశానిర్దేశం చేయనున్నారు ముఖ్యమంత్రి. నారావారిపల్లె నుంచి చంద్రబాబు వచ్చిన వెంటనే తెలంగాణ నేతలతో ఉండవల్లి నివాసంలో సమావేశంకానున్నారు.కాగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు తమ్ముడు నారా రామూర్తి నాయుడు మరణించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో నారావారిపల్లెలో సంవత్సరీకం, స్మృతి వనం ఏర్పాటు చేశారు. ఈరోజు ఉదయం నారావారిపల్లె సమీపంలోని రంగపేట హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం.. అక్కడి నుంచి నారావారిపల్లెలోని ఇంటికి చేరుకున్నారు. నారా రామూర్తినాయుడు సంవత్సరీకం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఆపై మధ్యాహ్నం రంగంపేట వద్ద ఉన్న హెలిప్యాడ్ నుంచి తిరుగు ప్రయాణం అయి.. ఉండవల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నారావారిపల్లెలో పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# జగన్‌కు హెలికాప్టర్ ఓకే.. రోడ్ షోకు నో పర్మిషన్



అనకాపల్లి జిల్లా, అక్టోబర్ 7: విశాఖపట్నం నుంచి మాకవరపాలెం వరకూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోడ్ షోకు అనుమతి ఇవ్వలేమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ప్రకటించారు. మాకవరపాలెంలో నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీ పనులను పరిశీలించడానికి ఈ నెల 9వ తేదీన జగన్ రానున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు (మంగళవారం) అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ విశాఖ నుంచి మాకవరపాలెం వరకు 63 కిలో మీటర్ల జాతీయ రహదారిపై కాన్వాయ్‌తో రావడానికి వైసీపీ శ్రేణులు అనుమతులు కోరినట్లు తెలిపారు. విశాఖ నుంచి మాకవరపాలెం వరకు హెలికాప్టర్‌పై మాజీ సీఎం జగన్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. జాతీయ రహదారి రోడ్డు మార్గంలో కూడళ్ల వద్ద జన సమీకరణ చేసే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా రోడ్డు మార్గంలో మాజీ సీఎం జగన్ పర్యటించేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. మాకవరపాలెం మెడికల్ కళాశాల వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేసి జగన్ మోహన్ రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చేలా అనుమతి ఇచ్చామన్నారు.

# భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శ్రీశైల పర్యటనను విజయవంతం చేద్దాం: నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



శ్రీశైలం(దేవస్థానం) అక్టోబరు 7 నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం నల్లమల అరణ్యంలోని ప్రముఖ శైవక్షేత్రం, అష్టాదశ శక్తి పీఠం, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటై భూ కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను తన ఆహ్వానం మేరకు దర్శనం చేసుకునేందుకు ఈ నెల 16 వ తేదీ గురువారం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శ్రీశైలం వస్తున్నారని తన ఆహ్వానం మన్నించి శ్రీశైలం వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకీ ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేద్దామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. మంగళవారం శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, శ్రీశైల దేవస్థానం పాలకమండలి సభ్యులు మేడా మురళీధర్, రేఖా గౌడ్ లతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైల శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలుకగా, అర్చకులు, వేదపండితులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, చైర్మన్ రమేష్ నాయుడు, సభ్యులు మేడా మురళి, రేఖలకు స్వామి, అమ్మ వార్ల దర్శనం అనంతరం శేష వస్త్రాలతో సన్మానం చేసి, తీర్థ ప్రసాదం, స్వామి, అమ్మవార్ల చిత్రపటంలు అందించి ఆశీర్వదించారు. శ్రీశైలంలోనే ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్ పి సునీల్ షేరాన్, శ్రీశైలదేవస్థానం ఈఓ శ్రీనివాసరావు, తదితర జిల్లా ఉన్నతాధికారులతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయముతో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ శ్రీశైలం పర్యటనను విజయవంతం చేద్దాం అని కోరారు. ఇప్పటికే అమరావ తిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిలు, అన్ని శాఖల ఉన్నతాధికారులతో ప్రధాన మంత్రి శ్రీశైల పర్యటనవిజయ వంతంపై సమీక్షా చేశారని, తిరుమల తిరుపతి దేవస్థానంలా శ్రీశైల దేవస్థానంను కూడా అభివృద్ధి చేసేందుకు, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలనీ, ప్రధానమంత్రి ద్వారా శ్రీశైల దేవస్థానంకు సహాయ సహకారం, నిధులు కోరుదాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.


# డీబీటీ నగదు బదిలీ ద్వారా ప్రభుత్వానికి రూ. 4.31 లక్షల కోట్లు ఆదా: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ముంబై, అక్టోబర్ 7: వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని మీకు తెలుసా. ఇది నిజం. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్రమంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు.



ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్-టైమ్ (తక్షణమే) ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు.దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, జఖఎ, డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను కాపాడుతూ, ప్రతి పౌరుడిని ఉద్ధరించేలా, టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు.

# 125 సీట్లలో ఆర్జేడీ పోటీ..



పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి భాగస్వాముల మధ్య సీట్ల పంపకాలకు సంబంధించిన ఫార్ములా ఖరారైనట్టు సమాచారం. పాట్నాలో మంగళవారంనాడు జరిపే మీడియా సమావేశంలో సీట్ల కేటాయింపుపై అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కూటమిలో సీనియర్ భాగస్వామిగా రాష్ట్రీయ జనతా దళ్ ఉండనుంది. కాంగ్రెస్ 55 నుంచి 57 సీట్లకు పరిమితం కానున్నట్టు తెలుస్తోంది.సీట్ల కేటాయింపు ఫార్ములా ప్రకారం ఆర్జేడీ 125 సీట్లలో పోటీ చేయనుండగా, కాంగ్రెస్ 55 నుంచి 57 సీట్లలో పోటీ చేస్తుంది. వామపక్ష పార్టీలకు 35 సీట్లు కేటాయిస్తున్నారు. ముఖేష్ సాహ్ని వీఐపీ పార్టీకి 20 సీట్లు, పశుపతి పరస్‌కు 3 సీట్లు, జార్ఖండ్ ముక్తి మోర్చాకు రెండు సీట్లు కేటాయించనున్నారు. పంపకాల ప్రక్రియ సజావుగానే ఉందని కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు చెబుతున్నప్పటికీ సీట్ల పంపకాలపై విభేదాలు ఇంకా తొలగలేదని చెబుతున్నారు.కాంగ్రెస్ 78 సీట్లు అడుగుతుండగా, 48 సీట్లు ఇచ్చేందుకు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సుముఖంగా ఉన్నారు. దీంతో మధ్యేమార్గంగా కాంగ్రెస్‌కు 55 సీట్లు వరకూ కేటాయించవచ్చని అంచనా వేస్తున్నారు. సంప్రదాయబద్ధంగా పోటీ చేస్తున్న కొన్ని సీట్లు కాంగ్రెస్ వదులుకునేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఉదాహరణకు పాట్నా జిల్లాలో గత ఎన్నికల్లో నాలుగు సీట్లకు పోటీ చేసిన కాంగ్రెస్ ఈసారి ఆ సీట్లను కోరుకోవడం లేదు. దీంతో గతంలో కాంగ్రెస్ చేతిలో ఉన్న సీట్లు ఇప్పుడు ఆర్జేడీ ఖాతాలోకి వెళ్లనున్నారు.




# సంపాదకీయం

బుధవారం 08-10-2025

## బీహార్ లో కులమే ప్రధానం...

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. మొత్తం 2 దశల్లో బిహార్ ఎన్నికలను నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. మొదటి విడత ఎన్నికలు వచ్చే నెల 6వ తేదీన.. రెండో విడత అదే నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపింది. నవంబర్ 14వ తేదీన కౌంటింగ్ ఏర్పాటు చేసి అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. తొలి విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 10వ తేదీన ప్రారంభం కానుండగా.. రెండో విడత ఈనెల 13వ తేదీన మొదలు కానుంది. ఇక దేశవ్యాప్తంగా ఉన్న ఉపఎన్నికల తేదీలను కూడా ఈసీ వెల్లడించింది. బీహార్ ఓటర్ల జాబితా వివాదం మధ్య, కొన్ని రోజుల్లోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వ్యూహాలను మెరుగుపరుచుకుంటున్నాయి. కానీ యథాప్రకారం అభ్యర్థుల ఎంపికలో కులం కార్డే కేంద్ర బిందువు అవుతుంది. ఏదైనా ఎన్నికల్లో రెండు విధాలుగా ఓటర్లను ప్రలోభపరచవలసి ఉంటుంది. ఐదేళ్ల క్రితం లాలూప్రసాద్ అప్పటి ఎన్నికలను అగ్డా (అగ్ర వర్గాలు), పిచ్చడా (వెనుకబడిన వర్గాలు) మధ్య పోరాటంగా అభివర్ణించారు. బిజెపిని సంప్రదాయ అగ్రకులాల, ఉన్నత వర్గాల పార్టీగా ప్రకటించారు. 2024లో 'ఇండియా కూటమి' కూడా రెండు విధాలుగా ప్రచారాన్ని ముందుకు సాగించాలని ఆకాంక్షించింది. వెనుకబడిన వర్గాలపైనే దృష్టిపెట్టి మరింత సంరక్షణ వారికి అవసరమని ప్రచారం సాగించింది బీహార్‌లో వెనుకబడిన వర్గాల సమీకరణకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వలస కాలంనుంచే ఈ తరహా ఉద్యమాలు మొదలయ్యాయి. ఇవి రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు అధికారాన్ని కట్టబెట్టాయి. ఈ వెనుకబడిన వర్గాల సమీకరణే ఎన్నికల పోటీకి సాధనంగా ఉపయోగపడుతుంది. ఉన్నతవర్గాలు, తక్కువస్థాయి వర్గాలు అన్న తేడాయే విచక్షణకు దారితీస్తుంది. ఏదెలాగున్నా పొత్తులు, ప్రతిపొత్తుల ఆట, మొత్తంమీద పార్టీ వ్యవస్థలో రాజకీయ చీలికలు ఈ రెండు కోణాల దృష్టిని నిత్యం క్లిష్టం చేస్తున్నాయి. చారిత్రకంగా చూస్తే బిజెపి అభ్యర్థుల ఎంపిక ఉన్నత కులాల అనుకూలంగానే ఉంటుంది. 2020 లో బిజెపి 74 మంది ఎంఎల్‌ఎల్లో 33 మంది (40%) ఉన్నత కులాల వారే. అలాగే ఎక్కడా బిజెపి ముస్లిం అభ్యర్థులను ఎంపిక చేయదు. అంటే దీని అర్థం మిగతా అభ్యర్థులు ఒబిసి(26), ఇబిసి(2) నుంచి ఎంపిక చేసిన వారే. దీనికి విరుద్ధంగా జెడియు 43 మంది ఎంఎల్‌ఎల్లో 22 మంది ఒబిసి, ఇబిసిలకు చెందినప్పటికీ కేవలం 10 మంది మాత్రమే ఉన్నత కులాల వారు ఉన్నారు. చాలామంది జెడియు ఎంఎల్‌ఎల్లో ఏడుగురు కుర్మీలు, నలుగురు యాదవులతో కలుపుకుని స్థానిక ప్రాధాన్యం కలిగిన ఒబిసి గ్రూపులకు చెందినవారే. మరోవైపు ఆర్‌జెడి నిర్మొహమాటంగా పూర్తిగా యాదవులకే అనుకూలంగా ఉంటుంది. 2020లో . 44 సీట్లలో 26ను గెలుచుకుంది. బిజెపి, జెడియుకు భిన్నంగా ఆర్‌జెడి ముస్లిం అభ్యర్థులను నియమించింది. కాంగ్రెస్ కూడా అలాగే చేసింది. వాస్తవానికి ప్రధాన పార్టీలన్నిటిలో కాంగ్రెస్ లోనే ముస్లిం ఎంఎల్‌ఎల జనాభా ఎక్కువ. బిజెపి, జెడియు లేదా ఆర్‌జెడి ఏదైనా ఎన్నికైన ఒబిసి ఎంఎల్‌ఎల్లో మెజార్టీ స్థానిక ప్రాధాన్యం కలిగిన సామాజిక వర్గాలవారే ఎంపికయ్యారు. ఇబిసిలు ప్రచార వాక్చాతుర్యానికి కేంద్రబిందువే అయినప్పటికీ, చాలావరకు మినహాయింపబడ్డారు. బీహార్ జనాభాలో ఇబిసిలు దాదాపు 36 శాతం నుంచి 40 శాతం ఉన్నప్పటికీ, 2020 అసెంబ్లీలో వారి ప్రాతినిధ్యం కేవలం 11 శాతానికి పరిమితమైంది. చాలా పార్టీలు తమ టికెట్ల పంపిణీలో వైవిధ్యం చూపించినప్పటికీ ఫలితాలలో పెద్ద చీలిక కనిపించింది. తీవ్రమైన కుల విభజనే కీలకమవుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 22 శాతం ఓట్లతో ఆర్‌జెడి అతిపెద్ద పార్టీగా తెరపైకి వచ్చింది. 2014 నుంచి హిందీ బెల్టులో బిజెపి ఆధిపత్యం వహిస్తున్నా ఓట్లలో అయిదోవంతు మాత్రమే పొందగలిగింది. అభ్యర్థుల ఎంపికలో వైవిధ్యం చూపించాలని బిజెపి కాంక్షిస్తున్నా, అధికారంలో ఉండడానికి మిత్రవర్గాల పొత్తుపైనే ఆధారపడవలసి వస్తోంది. ముఖ్యంగా దాని ప్రధాన మిత్రపక్షం జెడియు తన జాతి మతపరమైన జాతీయవాద భాగాన్ని పంచకుండా ఇప్పటికీ సెక్యులర్‌శక్తిగా తన అస్తిత్వాన్ని ప్రదర్శిస్తోంది. కులాల చీలిక, వెనుకబడిన వర్గాల సుదీర్ఘ చారిత్రక ప్రభావం బిజెపి హిందుత్వవాదాన్ని అడ్డుకుంటున్నాయి. సామాజిక, ఎన్నికల పొత్తుల నిర్మాణానికే మొగ్గుచూపుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ వంటి చరిష్మా కలిగిన హిందుత్వరాజకీయ నేత లేకపోవడం కూడా బిజెపికి మైనస్ పాయింటే. మతపరమైన కేంద్రీకరణ బీహార్‌లో చాలా తక్కువ ప్రభావం చూపుతుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల ముఖ చిత్రాన్ని పరిశీలిస్తే బీహార్ రాజకీయ వ్యాకరణ మౌలిక స్వరూపం మారే అవకాశం లేదు. 2023లో నితీశ్‌కుమార్ నిర్వహించిన కులాల గణన బట్టి బీహార్ రాజకీయాల్లో కులమే ప్రధాన బలమైన పునాదిగా వెల్లడవుతోంది. ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల జాబితాపై సమగ్ర సర్వే ఒకటి కాగా, మరొకటి ప్రశాంత్ కిశోర్ 'జనసూరజ్' ప్రచారం. పంజాబ్‌లో స్థానిక ఉన్నత వర్గాలను తిరస్కరించి ఓటర్లు బయటనుంచి వచ్చిన ఆమ్‌ఆద్మీపార్టీకి ఎలాగైతే పట్టం కట్టారో అలాగే బీహార్‌లో కూడా జరుగుతుందని ప్రశాంత్ కిశోర్ భవిష్యత్ రాజకీయ అంచనాలు వేస్తున్నారు. కానీ బీహార్ పంజాబ్‌లా కాదు. ఇక్కడ కులం అన్నది చాలా లోతుగా వేళ్లూనుకుంది. కిశోర్ స్వంత ఏ పార్టీకి ఫలితాలు ఎలా వస్తాయో చెప్పలేకపోయినా ఇప్పుడు అనిశ్చితి మాత్రం వెంటాడుతోంది.

## ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వాయుసేన భారత వైమానిక దళం

-నేడు భారత వైమానిక దళ వ్యవస్థాపక దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )


భారత వైమానిక దళం (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) ఆవిర్భావమై నేటికి 93సంవత్సరాలు. 1932 అక్టోబరు ఎనిమిదో తేదీన స్థాపితమైన ఐఎఎఫ్.. మొత్తం ఐదు ఆపరేషనల్ కమాండింగ్ కేంద్రాలను కలిగిన ఐఎఎఫ్‌కు 1,130 కంబోట్ 1,700 నాన్ కంబోట్ ఎయిర్‌కాఫ్ట్‌లు ఉన్నాయి. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద వాయుసేనగా భారత వైమానిక దళం పేరుగడించింది. తనకు అవసరమైన సిబ్బందికి అధునాతన శిక్షణ ఇచ్చుకోవడంలోను, అధునాతన యంత్రసామాగ్రిని సమకూర్చుకోవడంలోను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ముందంజలో ఉండటమే కాకుండా..




ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. 1932 అక్టోబర్ 8న ఏర్పడిన భారత వైమానిక. దళం బ్రిటీష్ తరపున రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నది. దానికి గుర్తుగా 1945లో రాయల్ భారత వైమానిక దళంగా మార్చబడింది. 1950లో గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తరువాత భారత వైమానిక దళంగా రూపాంతరం చెందింది. 1933 ఏప్రిల్ 1న భారత వైమానిక దళానికి తొలి ఎయిర్‌క్రాఫ్ట్ వచ్చి చేరింది. ఆరంభంలో కేవలం ఐదు మంది పైలట్స్, ఒక ఆర్‌ఏఎఫ్‌ను కలిగివున్నది. ఇండియన్ ఎయిర్ ఫోర్సుకు తొలి ఐదుగురు పైలట్స్‌గా విధులు నిర్వహించిన ఘనత హరీష్ చంద్ర సిర్కార్, సుబ్రొతో ముఖర్జీ, భూపేంద్ర సింగ్, అజాద్ భక్షా అవాన్, అమర్జీత్ సింగ్‌లు వైమానిక చరిత్ర పుటల్లో నిలిచిపోయారు. ఆ తర్వాత సుబ్రతో ముఖర్జీ తొలి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. తర్వాత రెండో ప్రపంచ యుద్ధానికి ముందు.. అంచలంచెలుగా మరింత మంది సిబ్బందిని ఐఎఎఫ్ నియమించుకుంది. వీరిలో అస్పీ ఇంజనీర్, కేకె.ముజుందర్, నరేంద్ర, దల్జీత్ సింగ్, హెన్రీ రంగనాథన్, ఆర్‌హెచ్‌డి సింగ్, బాబా మెహర్ సింగ్, ఎస్‌ఎన్.గోయల్, ప్రిత్‌పాల్ సింగ్, అర్జన్ సింగ్‌లు అగ్రగణ్యులు. వీరు వాయుసేనకు అందించిన సేవలు ప్రశంసనీయం. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో భారత వాయుసేన క్రియాశీలక పాత్రను పోషించింది. తొలి వైమానిక దళ దాడి అర్కన్ ప్రాంతంలోని జపనీస్ సైనిక స్థావరంపై జరిపింది. ఈ యుద్ధం తర్వాత ఐఎఎఫ్‌ను అంచలంచెలుగా వృద్ధి చెందింది. యూఎస్‌కు చెందిన వుల్టీ వెంగియన్స్, బ్రిటీష్ హాకర్ హరికేన్, వెస్ట్‌లాండ్ లైసండర్ వంటి అధునాతన ఎయిర్ క్రాఫ్ట్‌లు ఐఎఎఫ్‌లో వచ్చి చేరాయి. అంతేకాకుండా.. భరతగడ్డపై పొరుగు దేశాలు దాడికి తెగబడినపుడల్లా భారత వాయుసేన కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు1.70 లక్షల మంది సిబ్బందితో, 1300 విమానాలతో భారత వైమానిక దళం ప్రపంచంలోనే నాలుగవ పెద్ద వైమానిక దళంగా ప్రసిద్ధి పొందింది.ముఖ్యంగా.. 1960లో ఏర్పడిన కాంగో సంక్షోభ సమయంలోను, 1962లో జరిగి ఇండో-చైనా పోరు సమయంలోను, కాశ్మీర్ కోసం 1965లో పాకిస్తాన్‌తో జరిగి యుద్ధ సమయంలోను, 1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలోను, 1984లో జరిగి ఆపరేషన్ మేఘదూత్‌లోను, 1988లో ఆపరేషన్ కాక్టస్‌లోను, 1999లో జరిగిన ఆపరేషన్ సఫేద్ సాగర్ (కార్గిల్ వార్) సమయాల్లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సేవలు ప్రశంసనీయం. గడచిన ఎనిమిది దశాబ్దాల్లో మన వైమానిక దళం సాంకేతికంగా ఎంతోఅభివృద్ధి చెందింది. ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉంది. భారత గగన తలంలోకి ఇతర దేశాల విమానాలు చొచ్చుకుని రాకుండా నిరంతరం నిఘా వేస్తోంది. అదే సందర్భంలో దేశంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులను రక్షించడానికి, వారికి సహాయం చేయడానికి వైమానికదళం అందిస్తోన్న సేవలు అమోఘం. 93వ వార్షికోత్సవం సందర్భంగా ఈరోజు ఘజియాబాద్ లోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ హిండాన్ లో జరిగే పెరేడ్ లో వైమానిక దళ ప్రధానాధికారి గౌరవ వందనం స్వీకరిస్తారు.

## స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి : లింగాల కమల్ రాజు

మధిర, అక్టోబర్ 07 : ?రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం చింతకాని మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ?ఈ



సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అభ్యర్థుల ఎంపికపై ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ఎన్నికల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, గెలుపు గుర్రాలనే అభ్యర్థులుగా ఎంపిక చేసేలా ప్రణాళికలు రచించాలని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, రైతు నాయకులు మంకేన రమేశ్, పొనుగోటి రత్నాకర్, గడ్డం శ్రీను, సొసైటీ చైర్మన్ తాతా ప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కన్నెబోయిన కుటుంబరావు, యువజన నాయకులు పిన్నెల్లి శ్రీనివాస్, కోపూరి నవీన్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా

కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 7 : 2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని, రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి జిల్లా శాఖల ప్రతినిధులు, సభ్యులతో కలిసి మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి మాట్లాడుతూ.. గత ఏడాదిన్నర నుంచి ఇప్పటివరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రభుత్వము నుండి ఎలాంటి ప్రయోజనాలు అందలేదని, కేవలం పెన్షన్ ఉద్యోగ విరమణ పొందిన వారి ఖాతాల్లో జమ చేస్తుండగా, మానసిక వేదనకు గురవుతున్నట్లు వాపోయారు.పదవీ విరమణ ప్రయోజనాల లబ్ధి చేకూరకపోవడంతో మనోవేదనకు గురవుతూ అనేకమంది అసువులు బాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉద్యోగ విరమణ పొందిన వారికి చెల్లించాల్సిన ప్రయోజనాలు వెంటనే




విడుదల చేసేవారని గుర్తు చేశారు. 35 నుంచి 40 ఏళ్ల పాటు ప్రభుత్వ సేవలో పనిచేసి ఉద్యోగ విరమణ పొంది, చివరి అంకంలో ఉన్నవారి పట్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్ర భ ు త్వ ం వ్యవహరిస్తుండటం శో చ నీ య ం వ న్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ సత్వరమే విడుదల చేయాలన్నారు. జిపిఎఫ్, జిఐఎస్, టీఎస్జిఎల్ ఐ, లీవ్ ఎంక్యాస్మెంట్, కమ్యూటేషన్ గ్రాట్యుటీ, ఐదు పిఆర్సీ బకాయిలు, పెంచిన డి ఏ వాయిదాల పద్ధతి కాకుండా నగదు రూపంలో ఒకేసారి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎంను ఆదరించాలి : తుమ్మల వీరారెడ్డి



కట్టంగూర్, అక్టోబర్ 07 : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పార్టీని ప్రజలు ఆదరించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం కట్టంగూర్ లోని అమరవీరుల స్మారక భవన్‌లో జరిగిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీని ఓడించడానికి సీపీఎం పార్టీ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సీపీఎం ముందుకు వెళ్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పని చేయడానికి జిల్లా కమిటీ నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు.జిల్లాలో 120 ఎంపీటీసీలు, 200 సర్పంచులు, 2 వేల వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు పార్టీలో చర్చిస్తున్నామన్నారు. గెలుపోటములు నిర్వహించే శక్తి సీపీఎం పార్టీకి ఉందని, ఒంటరిగా పోటీ చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, నాయకులు చిలుముల రామస్వామి, గడగోజు రవీంద్రాచారి, జాల రమేశ్, ఊట్కూరి శ్రీను, జాల ఆంజనేయులు, కక్కిరేణి రామస్వామి, గంట వెంకన్న, సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ ఓటు హక్కు రద్దు చేయాలి.. వై సతీష్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ ఓటు హక్కు రద్దు చేయాలని రెడ్కో మాజీ చైర్మన్ వై సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోడ్‌ను మాత్రమే కాదు.. రాజ్యాంగాన్ని కూడా ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు.చెప్పేవి నీతి సూక్తులు.. చేసేటివి ఛండాలపు పనులు అన్నట్టుగా ఉంది కాంగ్రెస్ పార్టీ పనితీరు. ఓ వైపు రాహుల్ గాంధీ.. ఓట్ చోరీ అంటూ దేశమంతా తిరుగుతున్నారు. ఎలక్షన్ కమిషన్ ఒక పార్టీ తొత్తుగా మారిందని మాట్లాడుతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం.. కాంగ్రెస్ పార్టీ నాయకులే ఎన్నికల నిబంధనలను దర్జాగా ఉల్లంఘిస్తున్నారు అని సతీష్ రెడ్డి పేర్కొన్నారు.జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు, టికెట్ రేసులో ఉన్న నవీన్ యాదవ్.. ఎలక్షన్ కోడ్ వచ్చిన తర్వాత.. ఓటరు కార్డులు పంపిణీ చేయడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వనీతికి.. చట్టాలపై వారికి ఉన్న గౌరవానికి నిదర్శనం. ఎలక్షన్ కమిషన్ ఇవ్వాల్సిన ఓటరుకార్డులను అధికార పార్టీ పంపిణీ చేస్తోందంటే.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి.. తెలంగాణలో అనుముల రాజ్యాంగం ఏ స్థాయిలో అమలు చేస్తున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల కోడ్ మాత్రమే కాదు.. రాజ్యాంగాన్ని కూడాకాంగ్రెస్ పార్టీ ఉల్లంఘిస్తోంది అని సతీష్ రెడ్డి ధ్వజమెత్తారు.ఓ వైపు రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పుస్తకం పట్టుకుని నీతులు చెబుతారు.. తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ నాయకులు.. ఆ రాజ్యాంగాన్ని పాటించరు. వాళ్లకంటూకొత్తగా అనుముల రాజ్యాంగాన్ని రాసుకుని నడిపిస్తుంటారు. ఎలక్షన్ కమిషన్ నిజంగానే నిష్పక్షపాతంగా పనిచేస్తున్నట్టయితే.. వెంటనే నవీన్ యాదవ్ ఓటు హక్కు రద్దు చేయాలి. జూబ్లీహిల్స్ ఓటరు జాబితా నుండి ఆయనను తొలగించాలి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు ఈ ఎన్నికల్లో పోటీకి అతడిని అనర్హుడిగా ప్రకటించారు. లేకపోతే ముందు ముందు నిబంధనలకు విరుద్ధంగా ఇంకెన్ని పనులు చూస్తారో ఊహించలేము అని సతీష్ రెడ్డి పేర్కొన్నారు.

## బీహార్‌లో కొత్త పొత్తు కుదరనుందా.. చిరాగ్, పీకే జట్టు కడుతారా..?

బీహార్ లో వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల లో కొత్త పొత్తు కుదిరే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ కూటమి కట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ , జేడీయూ తో సీట్ల షేరింగ్‌లో లెక్క కుదరడం లేదు.బీహార్‌లోని మొత్తం 243 స్థానాల్లో ఎన్డీఏ కూటమిలోని ప్రధాన పార్టీలైన బీజేపీ, జేడీయూ తలో 100 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నాయి. మిగతా 43 స్థానాలను ఎల్‌జేపీ సహా చిన్నచిన్న పార్టీలకు ఇవ్వాలని ఆలోచిస్తున్నాయి. అందులో 25 స్థానాలు ఎల్‌జేపీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. కానీ ఎల్‌జేపీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్ మాత్రం.. తన పార్టీకి 40 అసెంబ్లీ స్థానాలు కావాలని అడుగుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 5 స్థానాలు కేటాయిస్తే ఐదింట గెలిచామని, ఇప్పుడు 40 స్థానాలు కేటాయించాల్సిందేనని పట్టుబడుతున్నారు.ఒకవేళ 40 స్థానాలు ఇవ్వకపోతే కూటమి నుంచి బయటికి వచ్చేందుకు రెడీగా ఉన్నట్లు సంకేతాలిచ్చారు. ఎన్డీఏ కూటమిలో షీట్ల షేరింగ్‌పై తాను బీజేపీతో మాత్రమే మాట్లాడుతానని, జేడీయూతో సంబంధం లేదని అన్నారు. అంటే నితీశ్ కుమార్ అంటే తనకు గిట్టదని ఆయన మరోసారి చెప్పకనే చెప్పారు. బీజేపీ కూడా తన డిమాండ్‌ను ఒప్పుకోకపోతే.. ఏ క్షణంలోనైనా కూటమి నుంచి బయటికి వెళ్లే ఆప్షన్ తనకు ఉన్నదని అన్నారు. ప్రశాంత్ కిషోర్‌తో కలిసి కూటమి ఏర్పాటు చేస్తే సగానికిపైగా స్థానాల్లో పోటీచేయవచ్చని, ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉంటాయని చిరాగ్ ఆలోచన అని, అది అతని ప్లాన్ బీ అని ఎల్‌జేపీ వర్గాలు చెబుతున్నాయి.

## మూడు పార్టీలనూ "లోకల్" ముంచేస్తుందా?

విజయవాడ, అక్టోబరు 7, ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు విడతల వారీగా ఎన్నికలు జరగడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమయింది. 2026 జనవరి లేదా మార్చి నెలల్లోనే ఈ ఎన్నికలు ఉండే అవకాశముంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అడ్వాంటేజీ ఉ ంటుంది. అంగబలం, అర్థబలం సమృద్ధిగా ఉండటంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ ప్రాంతంలో కూడా గెలిస్తే మేలు జరుగుతుందని ప్రజలు సహజంగా భావిస్తారు. అందుకే లోకల్ బాడీ ఎన్నికల్లో ఎక్కువగా అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తూ ఉంటాయి.. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్న నేతల మధ్య విభేదాలు ఎన్నికల ఫలితాలను ఏ రకమైన ప్రభావానికి గురి చేస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ ఉ ంది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ అగ్రనేతలు మాత్రం కలిసికట్టుగానే ఉన్నారు. కానీ నేతల మధ్యనే సఖ్యత లేదు. అది వాస్తవం. ఏ పార్టీ నియోజకవర్గంలో అధికారంలో ఉంటే మిగిలిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు వ్యతిరేకిస్తున్నారు. నామినేటెడ్ పదవులు తమకు దక్కకపోవడంతో పాటు పనుల కేటాయింపులో కూడా తమకు ప్రాధాన్యత దక్కడం లేదన్న అసహనం, అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తుంది. మద్యం షాపులు, ఇసుక, కాంట్రాక్టు పనులు వంటి విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు.? అసంతృప్తి.. అసహనం... కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మరొకవైపు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తున్నారు. కానీ నేతల మధ్య సమన్వయం లేమి కూటమి కొంపముంచుతుందేమోనన్న ఆందోళన ఎక్కువగా కనిపిస్తుంది. ఉదాహరణకు పిఠాపురం నియోజకవర్గమే తీసుకుంటే అక్కడ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే అక్కడ జనసేనలోనే రెండు నుంచి మూడు గ్రూపులున్నాయి. ఇక టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య పొసగడం లేదు. ఇలా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. లోకల్ ఎన్నికల్లో దెబ్బతీసి ఎమ్మెల్యేను అధినాయకత్వం ముందు దోషిగా నిలబెట్టాలన్న ప్రయత్నం జరుగుతున్నట్లు కనిపిస్తుందంటున్నారు. అదే జరిగితే కూటమిలోని మూడు పార్టీలకూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెన్నుపోట్లు తప్పవని కూటమి పార్టీ నేతలే అంటుండటం విశేషం. అయితే మరో మూడు నాలుగు నెలల సమయం ఉండటంతో అప్పటికి పరిస్థితి చక్కబడే అవకాశాలున్నాయన్న ఆశలు మాత్రం నేతల్లో కనిపిస్తుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## విశాఖపట్నంలో ఓజీ కారవాన్ బస్సు

### స్టార్ హోటల్ రేంజ్‌లో సౌకర్యాలు

విశాఖపట్టణం, అక్టోబరు 7, ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ, ఓజీ డ్రీమ్‌లైనర్ సంస్థ కలిసి విలాసవంతమైన కారవాన్ బస్సులను త్వరలో ప్రవేశపెడుతున్నాయి. విశాఖపట్నం నుండి అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు ఇవి అద్భుతమైన అనుభూతిని ఇస్తాయి. ఏసీ పడక గదులు, వంటగది, టీవీ, వైఫై వంటి సౌకర్యాలతో రెండు కుటుంబాలు సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. ఒక్కో వ్యక్తికి రూ.2,500తో రాత్రి బసతో కూడిన ప్యాకేజీలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ, ఓజీ డ్రీమ్‌లైనర్ సంస్థ కలిసి కారవాన్ బస్సులను త్వరలో అందుబాటులోకి తెస్తున్నాయి. ఈ బస్సులు నగర ప్రజలకు అద్భుతమైన పర్యాటక అనుభూతిని ఇస్తాయి. వీటిలో విలాసవంతమైన సౌకర్యాలు ఉంటాయి. పర్యాటక శాఖతో ఒప్పందం తర్వాత నిర్వాహకులు ప్యాకేజీలు ప్రకటిస్తారు. ఈ ఓజీ కారవాన్ బస్సులు స్టార్ హోటళ్లలా ఉ ంటాయి.. వీటిలో ఏసీ పడక గదులు, విశాలమైన హాళ్లు, వంటగది, మరుగుదొడ్డి వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రయాణికులు ఎంతో సౌకర్యంగా ప్రయాణించవచ్చు. విశాఖపట్నం నుంచి అరకు, పాడేరు, వంజంగి, లంబసింగి, అరసవల్లి, శ్రీకాకుళం, సీతంపేట, అన్నవరం, రాజమహేంద్రవరం, కాకినాడ వంటి అనేక పర్యాటక ప్రాంతాలను ఈ కారవాన్ బస్సులలో సందర్శించవచ్చుఈ ఓజీ కారవాన్‌లను విశాఖలో పర్యాటకులను ఆకర్షించడానికి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఓజీ కారవాన్‌లో రెండు కుటుంబాలు ప్రయాణించొచ్చు. అందుకు అవసరమైన వసతులు ఈ కారవాన్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఈ ఓజీ బస్సులో కూర్చోవడానికి సోఫాలు, పడకలు, మ్యూజిక్ సిస్టం, వినోదం కోసం రెండు టీవీలు, వైఫై, నచ్చిన ఆహారం వండుకోవడానికి వంటగది కూడా ఉంటుంది. ఒక్కో వ్యక్తి రూ.2,500 చెల్లిస్తే ఈ ఓజీ బస్సులో.. రాత్రి బసతో పాటు రోజంతా ప్రయాణించొచ్చు. పర్యాటకశాఖతో జరిగే ఒప్పందం మేరకు ఈ ధర ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.ఎవరైనా పర్యాటక ప్రదేశాల సందర్శించాలనుకుంటే ఈ కారవాన్ బస్సులు చాలా సౌకర్యంగా ఉంటాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులతో కలిసి జాలీ ట్రిప్ వేయొచ్చు. ఈ ఓజీ బస్సులో ఒకేసారి 10 నుంచి 15 మంది వెళ్లిరావొచ్చని చెబుతున్నారు. ఈ ప్యాకేజీలో ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు సమకూరుస్తారు. అంతేకాదు ఒకవేళ ఎవరికైనా ప్రత్యేకంగా వంటకాలు కావాలంటే ముందుగా చెబితే చేయిస్తాము అంటున్నారు. ఈ ఓజీ కారవాన్‌లో పైలట్‌తో పాటుగా వచ్చిన వారికి పర్యాటక ప్రాంతాల గురించి వివరించేందుకు గైడ్ కూడా అందుబాటులో ఉంటారు.త్వరలోనే ఈ ఓజీ కారవాన్ ప్యాకేజీలు అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారు నిర్వాహకులు. ఒకవేళ ఎవరికైనా ఆసక్తి ఉంటే.. 94400 30707 నంబరులో సంప్రదించాలని సూచిస్తున్నారు. విశాఖపట్నం నుంచి కారవాన్ టూరిజానికి నిబంధనలు రూపొందిస్తున్నామని చెబుతున్నారు. ఈ కారవాన్ టూరిజం ప్యాకేజీ ధరలపై త్వరలో క్లారిటీ వస్తుందని.. ఏ ప్రాంతానికి వెళితే, ఎంత ధర చెల్లించాలో నిర్ణయించాలనేది చర్చిస్తున్నామంటున్నారు. ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని చెబుతున్నారు. విశాఖపట్నం మాత్రమే కాదు మరికొన్ని పర్యాటక ప్రాంతాల్లో కూడా ఈ కారవాన్ టూరిజం అందుబాటులోకి రానుంది. త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది.

## విజయనగరంలో గోవా గవర్నర్ తో మంత్రి ఆనం మర్యాదపూర్వక భేటీ

విజయనగరం,దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. తరువాత మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు ని విజయనగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈ భేటీలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంఎల్సీ కావలి గ్రీష్మ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ పాల్గొన్నారు

# ఏపీలో 'స్క్రబ్‌టైఫస్' కే కలకలం

నెల్లూరు, అక్టోబరు 7, ఆంధ్రప్రదేశ్‌లో 'స్క్రబ్ టైఫస్' కేసులు కలకలం రేపుతున్నాయి. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం అధికం. జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి వంటి లక్షణాలుంటాయి. చికిత్స ఆలస్యమైతే మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీసి ప్రాణాంతకం కావచ్చు. నెల్లూరు జిల్లాలో నాలుగు కేసులు నమోదయ్యాయి. పరిసరాల శుభ్రత, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కేసులు నమోదయ్యాయి.. నల్లిని పోలిన ఒక చిన్న కీటకం కుడితే ఈ స్క్రబ్‌టైఫస్ బారినపడతారు. ఇది ఇళ్లలో పెద్దవాళ్లు, పిల్లలను కుడుతుంది.. కాకపోతే ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటికే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు స్క్రబ్ టైఫస్ టెన్షన్ మొదలైంది. కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ కీటకాలు ఇప్పుడు అన్ని చోట్లకూ వ్యాపించాయంటున్నారుఒక కీటకం కుడితే నల్ల మచ్చ వస్తుంది. ఏడు రోజుల పాటు జ్వరం ఉంటుంది. డెంగీ లాగే కండరాల నొప్పి, తలనొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. చికిత్స ఆలస్యం అయితే మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌కు దారి తీసి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. లక్షణాలను బట్టి యాంటీ బయోటిక్స్‌తో నయం చేయవచ్చు. కొన్నిసార్లు ఐసీయూ చికిత్స కూడా అవసరం అవుతుందని చెబుతున్నారు వైద్యులు.తాజాగా నెల్లూరు జిల్లాలో స్క్రబ్‌టైఫస్ కేసులు నమోదయ్యాయి. కావలి, వెంకటేశ్వరపురం, మనుబోలు, ఎన్టీఆర్‌నగర్‌లో ఈ ఏడాది 4 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా స్క్రబ్ టైఫస్ బాధిత కుటుంబ సభ్యులతో పాటుగా ఆ చుట్టుపక్కల వారికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? అని టెస్ట్‌లు చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా స్క్రబ్ టైఫస్ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి జీజీహెచ్‌కు పంపుతున్నారు. ఈ టైఫస్ జ్వరం నిర్ధారణ కోసం వీల్‌ఫెలిక్స్ పరీక్ష చేయాలని సూచిస్తున్నారు డాక్టర్లు.ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఒకవేళ ఇంట్లో పాత దిండ్లు, పరుపులు, మంచాలు, పరుపులు వంటివి తీసివేయడం మంచిదంటున్నారు. ఈ కీటకాలు రాత్రి వేళల్లో ఎక్కువగా దాడి చేసే అవకాశం ఉందంటున్నారు. అందుకే పిల్లల కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలని సూచిస్తున్నారు. చెట్లు ఎక్కువగా ఉన్న చోట్ల, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ పురుగులు ఎక్కువగా పొట్ట, బుగ్గలు, ఛాతి, పాదాలప కుడుతాయి అంటున్నారు.స్క్రబ్ టైఫస్ విషయంలో భయం అవసరం లేదని.. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్నారు డాక్టర్లు. ఒకవేళ ఎవరికైనా జ్వరం వచ్చి తగ్గకపోతే డెంగీ, టైఫాయిడ్, మలేరియాగా భావించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరుతున్నారు డాక్టర్లు. ఒకవేళ మచ్చలు కనిపిస్తే వెంటనే స్క్రబ్ టైఫస్ నిర్ధారించేందుకు రక్త పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదని.. ప్రజలకు ఆందోళన అవసరం లేదని.. కానీ ముందస్తు జాగ్రత్తలు కూడా అవసరం అంటున్నారు.

# నేను దేవుడ్ని...

### అమ్మను దేవుడి దగ్గరకు పంపించా...

కడప, అక్టోబరు 7, వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తల్లిని చంపిన యశ్వంత్ రెడ్డి మానసిక పరిస్థితిపై అనుమానాలు తలెత్తుతున్నాయి. యశ్వంత్ రెడ్డి మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. పోలీసుల విచారణలో కూడా తాను దేవుడిని అని.. ఆ విషయం అమ్మ నమ్మకపోవటంతోనే తల్లిని దేవుడి వద్దకు పంపించానంటూ యశ్వంత్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అల్లారుముద్దుగా పెంచిన కొడుకే తన పాలిట కాలయముడు అవుతాడని ఊహించలేకపోయిన ఆ కన్నతల్లి ఉ దంతం ఇప్పుడు సంచలనంగా మారింది.వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో తల్లిని చంపిన తనయుడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. యశ్వంత్ కుమార్ రెడ్డి మానసిక స్థితి సరిగా లేదని వార్తలు వస్తున్నాయి. అయితే తాను దేవుణ్ని అంటే నమ్మలేదనే తల్లిని చంపినట్లు యశ్వంత్ కుమార్ రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే..ప్రొద్దుటూరులోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక సంతానం యశ్వంత్ కుమార్ రెడ్డి. లక్ష్మీదేవి ప్రభుత్వ ఉ పాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఒక్కడే కొడుకు కావటంలో యశ్వంత్ కుమార్ రెడ్డిని గారాబంగా పెంచారు ఆ దంపతులు. కొడుకును బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనే ఉద్దేశంతో చెన్నైలో ఇంజినీరింగ్ చదివించారు. ఇంజనీరింగ్ పూర్తి కాగానే యశ్వంత్ కుమార్ రెడ్డి.. ఉద్యోగాన్వేషణలో భాగంగా హైదరాబాద్‌కు పంపించారు. ప్రతి నెలా ఖర్చుల కోసం డబ్బులు పంపించేవారు.ఈ క్రమంలోనే ఈ మధ్యనే ఒకసారి మూడు వేలు పంపించగా.. కొన్ని రోజులకే మరో పదివేలు కావాలని యశ్వంత్ రెడ్డి అడగటంతో తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో తల్లి మీద కోపం పెంచుకున్న యశ్వంత్ రెడ్డి.. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు చేరుకుని తల్లితో గొడవ పడ్డాడు. తండ్రిని గదిలో బంధించి తల్లి గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. కూరగాయలు కోసే కత్తితో కన్నతల్లి గొంతుకోసిన యశ్వంత్ రెడ్డి.. ఆ తర్వాత లక్ష్మీదేవి వరండాలోకి ఈడ్చుకుని వచ్చి పడేశాడు. ఆ తర్వాత తలుపులు బిగించుకుని టీవీలో పాటలు వింటూ కూర్చున్నాడు.మరోవైపు ఉద్యోగ ప్రయత్నాల కోసం హైదరాబాద్ చేరిన యశ్వంత్ రెడ్డి.. ఇన్నేళ్లు హైదరాబాద్‌లో ఒక్కడే రూమ్‌లో ఉంటున్నట్లు బంధువులు చెప్తున్నారు. ప్రతినెలా యశ్వంత్ ఖర్చుల కోసం ఇంటి నుంచి డబ్బులు పంపేవారని చెప్తున్నారు. అయితే యశ్వంత్ మానసిక స్థితిలో మార్పును గమనించిన అతని తల్లిదండ్రులు.. ఇంటికి వచ్చేయాలని కోరినా అతను వినిపించుకోలేదంటున్నారు. కేవలం డబ్బుల కోసం మాత్రమే యశ్వంత్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసేవాడని తెలిసిందిమరోవైపు హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రొద్దుటూరులోని ఇంటికి చేరుకున్న యశ్వంత్ రెడ్డి.. వచ్చిన వెంటనే తల్లితో గొడవ పడినట్లు తెలిసింది. తాను దేవుణ్ని అని.. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వాలంటూ లక్ష్మీదేవితో గొడవపడినట్లు సమాచారం. పోలీసుల విచారణలోనూ యశ్వంత్ రెడ్డి ఇదే విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. తాను దేవుడిని అంటే తల్లి నమ్మడం లేదని.. అందుకే దేవుడి వద్దకు పంపించానని యశ్వంత్ చెప్పినట్లు సమాచారంఈ క్రమంలోనే యశ్వంత్ రెడ్డి మానసిక స్థితిగతులపై పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. హైదరాబాద్‌లో అతను ఉన్న పరిస్థితులు.. గతంలో మానసిక సమస్యలతో ఎప్పుడైనా ఇబ్బందులు పడ్డారా అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా ఒక్కగానొక్క కొడుకు అంటూ గారాబంగా పెంచిన కన్నతల్లినే.. ఓ కొడుకు అమానుషంగా గొంతుకోసి హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

# చేశాం... చెప్పుకోలేకపోయాం

కడప అక్టోబరు 7, మేం చేసింది చెప్పుకోలేకపోయాం. ప్రజలకు అన్నీ చేశాం కానీ? వాటిని ప్రచారం చేసుకోలేకపోయాం.. ఇటీవల జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణుల వద్ద వ్యక్తం చేసిన బాధ ఇది. అయితే ఆయన బాధకు కారణం కూటమి ప్రభుత్వం చర్యలు. ఒకవైపు అభివృద్ధి చేస్తోంది. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఎక్కడా ఆర్భాటం చేయడం లేదు. కానీ ప్రజల్లోకి కూటమి ప్రభుత్వం పనులు వెళుతున్నాయి. ప్రజల నుంచి సానుకూలత వస్తోంది. అలాగని వైసీపీ మాదిరిగా వాలంటీర్లు లేరు. ఐ ప్యాక్ లాంటి టీం కూడా లేదు. అయినా సరే కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి వెళ్తున్నాయి. దీనిని చూసి జగన్మోహన్ రెడ్డి తలలు పట్టుకుంటున్నారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ ఆయన తేడా గుర్తించలేకపోవడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వాలంటీర్లు ఉండేవారు. ప్రతి 50 కుటుంబాల బాధ్యతలను చూసేవారు. వారే ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసేవారు. చక్కటి చిరునవ్వుతో లబ్ధిదారులను పలకరించేవారు. అయితే ఆ పింఛన్ అందిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. అసలు ప్రజా ప్రతినిధులతో సంబంధం లేదని.. వాలంటీర్ల చొరవతోనే తమకు పింఛన్లు అందుతున్నాయని భావించేవారు లబ్ధిదారులు. అస్సలు పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, మంత్రుల జోక్యం ఉండేది కాదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అలా కాదు. సీఎం చంద్రబాబు ప్రతినెలా ఒకటో తేదీన ఏదో ఒక జిల్లాకు వెళ్తున్నారు. స్వయంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రుల సైతం ప్రజల్లోకి వెళ్లి పింఛన్లు అందించగలుగుతున్నారు. తద్వారా సంక్షేమ పథకాలు బాగానే అమలు చేస్తున్నామని.. బాధ్యతగా పర్యవేక్షిస్తున్నామని ప్రజలకు సంకేతాలు పంపగలుగుతున్నారు.ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ అయ్యింది. విజయవాడలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోల్లోనే ప్రయాణించి వేదిక వద్దకు చేరుకున్నారు. వేలాది మంది ఆటో డ్రైవర్ల సమక్షంలో పథకాన్ని ప్రారంభించారు. వీలున్నంతవరకు ఎటువంటి హడావిడి లేకుండా.. ఆటో డ్రైవర్లతో మమేకం అయ్యారు. జిల్లా కేంద్రాల్లో మంత్రులు, నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరిపించారు. ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందన్న ఆలోచనను ప్రజల్లోకి పంపగలిగారు.అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం తాము ఎన్నో చేశామని.. చెప్పుకోలేకపోయామన్న బాధ వెనుక.. కూటమి ప్రభుత్వ చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అప్పట్లో ప్రభుత్వ పథకం అమలు చేసిన క్రమంలో మీడియాకు ప్రకటనలు ఇచ్చేవారు. వాలంటీర్లతో పని పూర్తి చేయించేవారు.

## సంక్షేమ పథకాలు కలిసొస్తాయా

విజయవాడ అక్టోబరు 7, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తిరిగి ఎన్నికలు ఎప్పుడు జరిగినా గట్టెక్కిస్తాయని భావిస్తున్నట్లుంది. అందుకే ఆయన పదే పదే సంక్షేమం పదాన్ని వల్లె వేస్తున్నారు. అభివృద్ధి అన్న మాట కంటే ఎక్కువగా సంక్షేమం అనే పదమే ఎక్కువ సార్లు ఆయన నోట వినిపిస్తుంది. గత పదిహేను నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. పింఛన్లను నాలుగు వేల రూపాయలకు పెంచడంతో పాటు, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు, ఆటో డ్రైవర్లకు పదిహేను వేల రూపాయలు వంటి పథకాలను అమలు చేశారు. వీటితో పాటు తల్లికి వందనంతో పాటు అన్నదాతకు అండగా నిలుస్తూ అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేశారు. సంక్షేమం విషయంలో చంద్రబాబు ను ఎవరూ తప్పుపట్టలేరు. గత మూడు దఫాలుగా... నిజానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు సంక్షేమం అమలు చేసిన దానికంటే ఎక్కువగా ఈ టర్మ్ లో అమలు చేసి చూపుతున్నారు. గతంలో మూడు దఫాలు ఆయన విజన్ తో పనిచేసేవారు. సంక్షేమం అనేది ఆయనకు లీస్ట్ ప్రయారిటీగా ఉ ండేది. రాష్ట్ర భవిష్యత్ అంటూ సుదూర దృష్టితో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వారు. కానీ ఈసారి మాత్రం చంద్రబాబు నాయుడు అందుకు భిన్నంగా కనిపిస్తున్నారు. కార్యకర్తల సంక్షేమాన్ని కూడా పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పుడంతా సంక్షేమ మంత్రవే ఆయన నోటి నుంచి వినిపిస్తుండటం ఒకింత పార్టీ నేతలకు ఆశ్చర్యం కలిగిస్తుంది. చంద్రబాబు నాయుడు తన పై ఉన్న అపవాదును చెరిపేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయరు అన్న వారి నోళ్లను మూయించడానికే సంక్షేమాన్ని భారమైనా భుజానకెత్తుకున్నారంటున్నారు.అయితే సంక్షేమాన్ని అమలు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే రెండోసారి విజయం సాధించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ అనేక సంక్షేమ పథకాలను ఇబ్బడి ముబ్బడిగా అమలు చేసిన కేసీఆర్ ను కూడా ప్రజలు ఓడించారు. ఇక గత ప్రభుత్వ హయాంలో దాదాపు 2.75 లక్షల కోట్ల రూపాయలను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశానని జబ్బలు చరుచుకున్న జగన్ ను కూడా పక్కన పెట్టేశారు. అంటే సంక్షేమం ఎప్పటికప్పుడు టర్న్ అవుతుందా? అన్నది మాత్రం ఇక్కడ అర్థం కావడం లేదు. ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కంటే ఒకింత ఎక్కువే ఇవ్వాల్సి ఉంటుంది. కోతలు పెట్టడానికి వీలుండదని భావించి ప్రజలు మార్పును కోరుకుంటే సంక్షేమ మంత్ర పనిచేయదని చెప్పాలి. అందుకే చంద్రబాబు పదే పదే సంక్షేమం నినాదాన్ని అందుకున్నప్పటికీ ఫలితాలు మాత్రం చివర వరకూ చెప్పలేమన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రానురాను రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దిగజారిపోవడమే తప్పించి పెరగడం జరగదని తెలిసినా పాలకులు మాత్రం సంక్షేమం వైపునకు పరుగులు తీయడం కొన్నివర్గాల నుంచి పెదవి విరుపులు వినిపిస్తున్నాయి.

## ఉత్తరాంధ్రపై జగన్ గురి

విశాఖపట్టణం, అక్టోబరు 7, ఉత్తరాంధ్ర పై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టారా? పార్టీని బలోపేతంపై దృష్టి పెట్టారా? వచ్చే ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారా? అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఇప్పుడే వ్యూహం రూపొందిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2029 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో ఎక్కువ సీట్లు తెచ్చుకుంటేనే వైసీపీకి ఛాన్స్ ఉంటుంది. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు ఎన్నికలను ఎదుర్కొంది. అందులో రెండింట దారుణ పరాజయం చవిచూసింది. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం.. ఉత్తరాంధ్రలో ఆరు సీట్లను గెలుచుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది ఉత్తరాంధ్రలో. అందుకే మరోసారి ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఉత్తరాంధ్రలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాయలసీమ అండదండగా నిలుస్తూ వస్తోంది. అక్కడ 70కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2014లో వైసీపీకి అక్కడ మెజారిటీ వచ్చింది. 2019లో స్విప్ చేసింది. 2024లో మాత్రం ఓ ఏడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. అందుకే వచ్చే ఎన్నికల్లో రాయలసీమలో మెజారిటీ సీట్లు దక్కించుకొని.. ఉత్తరాంధ్రలో మెరుగైన స్థానాలు పొందితే.. మ్యాజిక్ ఫిగర్ దాటవచ్చు అన్నది జగన్మోహన్ రెడ్డి అంచనా. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఉత్తరాంధ్రలో వచ్చే స్థానాలను అనుసరించి మాత్రమే వైసిపి అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉంటుంది. అందుకే మూడున్నర ఏళ్ల ముందే ఉత్తరాంధ్రలో పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు జగన్మోహన్ రెడ్డి. అందుకే సీనియర్లను యాక్టివ్ చేస్తున్నారు.ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అందులో ఓ 20 స్థానాలపై గురిపెట్టినట్లు సమాచారం. ఉత్తరాంధ్రలో సీనియర్లుగా బొత్స సత్యనారాయణ,ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణ దాసు వంటి సీనియర్లు ఉన్నారు. వారితోనే ఈసారి రాజకీయం చేసి ఉ త్తరాంధ్రను దక్కించుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటు పరాన్ని నిరసిస్తూ నర్సీపట్నంలో ఆందోళన చేయనున్నారు. మొత్తం ఉత్తరాంధ్రను ఆకట్టుకునేలా భారీ ప్లాన్ రూపొందించారు. విశాఖలో భారీగా పరిశ్రమల ఏర్పాటు జరుగుతోంది. పెట్టుబడులు కూడా వస్తున్నాయి. అది కచ్చితంగా కూటమికి ప్లస్ అవుతుంది. అందుకే ఈ పరిశ్రమల ఏర్పాటుకు జరుగుతున్న భూ సమీకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపులో జరుగుతున్న లోపాలపై పోరాటం చేయాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. తద్వారా కూటమి దూకుడుకు కళ్లెం వేయడంతో పాటు పార్టీని కొంతవరకు నిలబెట్టవచ్చని భావిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు మరి ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.



## డ్రైనేజీ పనుల్లో అధికారులు పూర్తిగా విఫలం

### ఉన్నచోట తీయరు లేని చోట తవ్వకాలు



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-పట్టణంలో పారిశుధ్య పరిస్థితులు రోజురోజుకీ దిగజారుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడ సరిగా పనిచేయాలో అక్కడ అధికారులు కళ్లెదుటా సమస్యలు ఉన్నా చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నచోట డ్రైనేజీ లైన్లు పూడిపోయి మురుగు నీరు వీధుల్లోకి వచ్చి దుర్వాసన వ్యాపిస్తోంది. దానిపై ఎటువంటి చర్యలు లేకపోవడం స్థానికులను తీవ్రంగా ఆగ్రహానికి గురిచేస్తోంది. అదే సమయంలో డ్రైనేజీ లేని ప్రాంతాల్లో మాత్రం అనవసర తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రజలకు అవస్థలు, ట్రాఫిక్ అంతరాయం, దుమ్ము, దుర్వాసనతో పౌరులు ఇబ్బందులు పడుతున్నారు. తవ్వకాలు పూర్తయ్యాక వాటిని పూడ్చకపోవడం వల్ల ప్రమాదాలకూ దారితీస్తున్నాయి. ప్రజల ఆరోగ్యం, శుభ్రత పట్ల శానిటేషన్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. "ప్రజా డబ్బులతో పనులు చేసి ప్రజలకే కష్టాలు కలిగించడం సిగ్గుచేటు'' అని విమర్శిస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, నిల్వ నీరు, దోమల పెరుగుదలతో పరిస్థితి దయనీయంగా మారిందని పౌరులు వాపోతున్నారు. శానిటేషన్ విభాగంపై మున్సిపల్ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వాల్మీకి రచించిన రామాయణం మహాకావ్యం మానవాళికి ఆదర్శం


### స్పెషల్ బ్రాంచ్ ఉప పర్యవేక్షక అధికారి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07?? జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదికావి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ సునిల్ షెరాన్ ఆదేశాల మేరకు, జిల్లా పోలీస్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు.?స్పెషల్ బ్రాంచ్ ఉప పర్యవేక్షక అధికారి (డీఎస్పీ) శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.?ఈ సందర్భంగా ఉప పర్యవేక్షక అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి రచించిన "రామాయణం మహాకావ్యం" సమస్త మానవాళికి ఆదర్శమని అన్నారు. "ఎందరో మహానుభావులు జన్మించిన పుణ్యభూమి భారతదేశం. నేటి తరం యువత వాల్మీకి మహర్షి వంటి మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తి పొంది, వారి మార్గంలో పయనించాలి. అప్పుడే వారు అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించగలుగుతారు" అని పేర్కొన్నారు.?అలాగే, వాల్మీకి మహర్షి గొప్ప మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణాన్ని రచించి సమాజానికి అందించారన్నారు. నేడు ఆయన జయంతి సందర్భంగా, మనమందరం వాల్మీకి మహర్షి చూపిన దారిలో నడుస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో ఉప పర్యవేక్షక అధికారి తో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రాగన్ పడవ పోటీలో సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ విద్యార్థికి స్వర్ణ, కాంస్య, రజత పతకాలు..

విభారే న్యూస్ అక్టోబర్ 07 ఎమ్మిగనూరు..కర్నూలు నగరంలో అక్టోబర్ 4,5, 2025 తేదీలలో ఆంధ్రప్రదేశ్ కయాకింగ్ అండ్ కానోయింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రాగన్ పడవ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 2 బీటెక్ ఈ ఈ ఈ విభాగం విద్యార్థి రేవుల సురేంద్ర పాల్గొని విశేష ప్రతిభ కనబరిచాడు. ఈ విద్యార్థి 500 మీటర్ల సీనియర్ మెన్స్, 200 మీటర్ల సీనియర్ మెన్స్, మరియు 500 మీటర్ల జూనియర్ మెన్స్ విభాగాల్లో పోటీ పడి అద్భుత విజయాలను సాధించాడు. 200 మీటర్ల సీనియర్ మెన్స్ విభాగంలో స్వర్ణ పతకం, 500 మీటర్ల సీనియర్ మెన్స్ విభాగంలో కాంస్య పతకం, 500 మీటర్ల జూనియర్ మెన్స్ విభాగంలో రజత పతకం సాదించాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుధాకర్ తెలిపారు. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్, విభాధిపతులు మరియు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, విద్యార్థిని అభినందించారు.



# వాల్మీకి మహర్షి జీవితం మనకు స్ఫూర్తి ప్రదాత

### వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07:కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు క్రమశిక్షణతో కృషి చేస్తే జీవితంలో ఎత్తైన స్థాయికి ఎదగడం సాధ్యమవుతుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎం.డి. ఫరూక్ అన్నారు. మంగళవారం శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి మంత్రి ఫరూక్, వాల్మీకి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి "ఆదికవి''గా మానవజాతికి చిరస్మరణీయమైన రామాయణాన్ని రచించి ప్రపంచ సాహిత్యంలో శాశ్వత స్థానం సంపాదించారని గుర్తుచేశారు. ఆయన




జీవితం, ధర్మబోధనల్లో నిగూఢమైన మానవతా విలువలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. రామాయణం కేవలం ఒక ఇతిహాస కథ కాదు, జీవన విధానానికి మార్గనిర్దేశం చేసే సాహిత్య కావ్యం" అని మంత్రి అన్నారు. నారద మహర్షి సూచనలతో అడవిలో నివసిస్తూ వాల్మీకి మహర్షి 24 వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించారని, ఆయన రచనలో ప్రతిఫలించిన ధర్మం, నైతికత, సత్యం, న్యాయం వంటి విలువలు సమాజ నిర్మాణానికి పునాది వేశాయని వివరించారు. యువత వాల్మీకి మహర్షి జీవితం నుండి స్ఫూర్తి తీసుకొని కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలనీ మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు.

## ప్రధానమంత్రి పర్యటనకు శ్రీశైలంలో పోలీస్ భద్రతా బందోబస్తు

### ఐజీ ఆర్.కె. రవికృష్ణ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07-ఈనెల 16వ తేదీన భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం చేరుకొని భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారిని దర్శించుకోనున్న సందర్భంగా, భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఐజీ ఆర్.కె. రవికృష్ణ, గారి ఆధ్వర్యంలో శ్రీశైల పరిపాలన విభాగంలోని మీటింగ్ హాల్‌లో జరిగింది. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి హెలిపాడ్‌లు, రూట్ బందోబస్తు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ నియంత్రణ, పికెట్లు, చెక్‌పోస్టులు తదితర



అంశాలపై సమగ్రంగా చర్చించారు. పీఎం పర్యటన సందర్భంగా ఏ విధమైన లోపం చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఈ సమీక్షలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, గ్రేహౌండ్స్ డీఐజీ బాపూజీ, నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, ప్రకాశం ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీజీపీ కార్యాలయం అధిరాజ్ సింగ్ రాణా, ఈజీ అశోక్ కుమార్, సీఐడీ ఎస్పీ శ్రీధర్ రావు, అదనపు ఎస్పీ యుగంధర బాబు, ఆత్మకూరు డీఎస్పీ రాంజీనాయక్, శ్రీశైలం సీఐ ప్రసాదరావు సహా జిల్లా సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## భారత ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేసిన మతోన్మాదిని కఠినంగా శిక్షించాలి మాజి ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు



కర్నూలు , భారత ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బి.ఆర్.గవాయ్ గారి పైన దాడి చేసిన మతోన్మాదిని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ మెంబర్ ఎం సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వెలువడిన పత్రిక ప్రకటనలో సుధాకర్ బాబు గారు మాట్లాడుతూ న్యాయ చరిత్రలో ఇలాంటి సంఘటన దురదృష్టకరమని ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాది చెప్పుతో దాడికి యత్నించడం తీవ్రంగా ఖండిస్తున్నామని శాంతమూర్తి అయిన గవాయి గారు అతనిపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోవద్దని వదిలేయండి అని అన్నారని ఇటువంటి వారిని వదిలిపెడితే ప్రజాస్వామ్యానికి ముప్పు అని అతనిని వెంటనే కఠినంగా శిక్షించాలని దీని వెనక ఆర్ఎస్ఎస్ కుట్ర దాగి ఉందని మతోన్మాద శక్తులు ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తాయని కులమతాలతో ప్రజల మధ్య చీలికలు తేవాలని దురాలోచనతో బిజెపి ప్రభుత్వం ఉందని జరిగిన సంఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని సుధాకర్ బాబు గారు తెలియజేశారు. అనంతరం కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ దళిత జాతికి చెందిన ప్రధాన న్యాయమూర్తి పై న్యాయవాది బూటు విసరడం జరిగిందని ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విష్ణుమూర్తి విగ్రహం కేసు విషయంలో తీర్పు ఇచ్చారని సోషల్ మీడియాలో వక్రీకరించారని దానిపై వివరణ ఇచ్చారని దళితుడనే ఉద్దేశంతోనే దాడి చేశారని దాడి చేసిన వారిని ప్రధాన న్యాయమూర్తికి శిక్షించే అధికారం ఉన్న ఆయన పెద్ద మనసుతో అతన్ని వదిలేయమని చెప్పడం జరిగిందని న్యాయమూర్తి పై బూటు విసరడం సమంజసం కాదని ఇది కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అనంత రత్నం మాదిగ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, కోడుమూరు మైనార్టీ నాయకులు వసి బాషా కాంగ్రెస్ నాయకులు జాన్ సదానందం, నవీన్ మొదలగువారు పాల్గొన్నారు.

## నన్నూర్ పిహెచ్‌సి లో నిర్వహించిన ఆశాడే సమీక్షా సమావేశము

కర్నూలు - నన్నూర్ పిహెచ్‌సి లో నిర్వహించిన ఆశాడే సమీక్షా సమావేశము లో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం కోసం పరిశుభ్రత, పారిశుధ్యం మరియు సురక్షితమైన తాగునీటిని ప్రోత్సహించడం అనే థీమ్ ను తెలియజేస్తూ నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు , నివారణ , చేతులు పరిశుభ్రత, ఇంట్లో మరుగుదొడ్లు మరియు సురక్షితమైన తాగు నీటి వాడకం ఆహార పరిశుభ్రత గురించి తెలియజేస్తూ ఈ విషయాలు అన్నీ స్కూల్ విద్యార్థులకు , గ్రామ ప్రజలకు తెలియజేయాలని సూచించారు . అలాగే పిహెచ్‌సి యొక్క వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు అలాగే గర్భవతులను త్వరగా గుర్తించి తప్పకుండ 12 వారాలలోపు ఆర్‌సిహెచ్ పోర్టల్ లో నమోదు చేయించి వారికి తప్పకుండ అన్నీ ఆరోగ్య సేవలు అందించాలి . ప్రతి బుధవారం , శనివారం తప్పకుండ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం జరిపి గర్భవతు లకు , పిల్లలకు తప్పకుండ టీకాలు వేయించాలని తెలిపారు . అలాగే అన్నీ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు గురించి తెలిపారు . ప్రతి రోజు ఆశా కార్యకర్త ఇ-యాఉం జీజూజూ లో అర్హులైన జంట , ఐఎఫ్ఏ, విటమిన్ఏ, హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి , అన్నీ రిపోర్టు సబ్మిట్ చేయవలెను అని తెలిపారు . ఆశాలు ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య సేవల గురించి తెలిపి అందరినీ ప్రభుత్వ ఆసుపత్రి తీసుకొని వచ్చి చికిత్స అందిచాలని తెలిపారు . అనంతరం ఐఎల్‌ఆర్, డీ ఫ్రిడ్జ్ ,టీకాల స్టాక్ రిపోర్టు , రిజిస్టర్ లు పరిశీలించి తగు సూచనలు చేశారు . ఈ కార్యక్రమములో డిసిఎం ప్రసాద్ , వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాది రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి : సిపిఐ జిల్లా నాయకుల డిమాండ్




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07:భారత రాజ్యాంగాన్ని అవమానపరిచేలా సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి పై సనాతనం పేరుతో బూటు విసిరిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. సంజీవనగర్ గేటు వద్ద సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమిని శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు పి. మురలీధర్ మాట్లాడుతూ, "రాజ్యాంగ సంస్థలను బెదిరించే ఈ చర్య దేశానికి మచ్చ" అన్నారు. నాయకులు జి. సోమన్న, జి. నాగరాముడు, ఎస్. సుశీలమ్మ, డి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకతకు నాంది

### ఎన్ ఎమ్ డి ఫిరోజ్ చేతుల మీదుగా పంపిణీ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 07 నంద్యాల పట్టణంలోని 14వ వార్డులో మంగళవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ ఎమ్ డి ఫిరోజ్ హాజరై లబ్ధిదారులకు తన చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎమ్ డి ఫిరోజ్ మాట్లాడుతూ ? "క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులు పౌర సరఫరా వ్యవస్థలో పూర్తిస్థాయి పారదర్శకతను తీసుకువస్తాయి. ఈ సాంకేతికత ద్వారా నిత్యావసర సరుకులు మరింత సులభంగా, నేరుగా ప్రజలకు చేరుతాయి. ఎవరికీ ఇబ్బందులు లేకుండా సరుకులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది'' అన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను సమయానికి, సమర్థవంతంగా చేపడుతోందని పేర్కొన్నారు. "స్మార్ట్ రేషన్ కార్డులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆహార భద్రతను బలోపేతం చేస్తాయి. భవిష్యత్తులో ప్రతి లబ్ధిదారుడు తన కార్డు ద్వారా సులభంగా సరుకులు పొందేలా ప్రభుత్వం సాంకేతికతను మరింత విస్తరిస్తుంది'' అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద రావు. జిల్లా రేషన్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు అకుమల్ల బ్రహ్మం స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## డ్రాగన్ పడవ పోటీలో సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ విద్యార్థికి స్వర్ణ, కాంస్య, రజత పతకాలు..



విభారె న్యూస్ అక్టోబర్ 07 ఎమ్మిగనూరు..కర్నూలు నగరంలో అక్టోబర్ 4,5, 2025 తేదీలలో ఆంధ్రప్రదేశ్ కయాకింగ్ అండ్ కానోయింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రాగన్ పడవ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 2 బీటెక్ ఈ ఈ ఈ విభాగం విద్యార్థి రేవుల సురేంద్ర పాల్గొని విశేష ప్రతిభ కనబరిచాడు. ఈ విద్యార్థి 500 మీటర్ల సీనియర్ మెన్స్, 200 మీటర్ల సీనియర్ మెన్స్, మరియు 500 మీటర్ల జూనియర్ మెన్స్ విభాగాల్లో పోటీ పడి అద్భుత విజయాలను సాధించాడు. 200 మీటర్ల సీనియర్ మెన్స్ విభాగంలో స్వర్ణ పతకం, 500 మీటర్ల సీనియర్ మెన్స్ విభాగంలో కాంస్య పతకం, 500 మీటర్ల జూనియర్ మెన్స్ విభాగంలో రజత పతకం సాదించాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్ తెలిపారు. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్, విభాధిపతులు మరియు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, విద్యార్థిని అభినందించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190